# శిలా నీవే శిల్పి నీవే శిల్పం నీవే...జయరాజు తత్వగీతం

రచన...జయరాజు  సంగీతం ..బల్లేపల్లి మోహన్  గానం...విజయ్ యేసుదాస్

శిలా నీవే శిల్పీ నీవే శిల్పము నీవే సృష్టిలో

1.నిన్ననువ్వు మలుచుకుంటు నిలిచిపో చరితలో

పుడమిలో అణువణువు నీదే పరవశించుట నేర్చుకో

జీవితం ఇక మళ్ళీ రాదు సార్థకం చేసుకో॥శిలా॥

2.పాడి పంటలు పసిడి రాసులు ఆలమందలు పాలధారలు

గరక పువ్వులు గడ్డి పాఋు లు తుమ్మెదలు తూనీగ నవ్వులు

ఎన్నో ఉండి ఏమి లేదని భాధపడతా వెందుకు ?

జీవించటం లో ఉన్న మధురిమ తెలుసుకోలేవెందుకో॥శిలా॥

3.పండు వెన్నెల నిండు పున్నమి సందె వెలుగులు ఇంద్ర ధనసులు

సూర్యచంద్రులు క్రాంతి ధారలు విశ్వమున విరభూసె తారలు

పుడమి ఎంత గొప్పదో మన పుట్టు కెంత భాగ్యమో॥శిలా॥

4.కొండ కోనలు వాగు వంకలు జంట గువ్వలు జుంటు తేనెలు

రామ చిలుకలు గోరువంకలు కోయిలలు కోనంగు లాటలు

తనివి తీరదు తనువు చాలదు జీవితం పై ఆశ సడలదు॥శిలా॥

5.వెలుగులను వేటాడు చీకటి చీకటిని చెండాడు వెలుగులు

పగలు రాత్రి రాత్రి పగలు జనన మరణం మరణ జననం

క్షణము క్షణమొక మధుర గానం జీవితం చిగురాకు తరుణం॥శిలా॥

6.నీటిలో మన జన్మ ఉన్నది నిప్పులో చైతన్యమున్నది

గాలిలో మకరంద మున్నది భూమి పైనే జీవ మున్నది

గాలిలో మకరంద మున్నది భూమి పైనే జీవ మున్నది

అమ్మతనమే అంతరాత్మగ సాగిపోతుంటి ధరణి

సృష్టికి ప్రతి సృష్టినిస్తు కదిలి పోతుంటి జనని॥శిలా॥

7.ప్రకృతే మన పంచ ప్రాణం. ప్రకృతే మన హరిత హారం

ప్రకృతే మన కల్పవల్లి ప్రకృతే మన కన్న తల్లి

ప్రకృతిని కాపాడి నపుడే ప్రగతి సాగే నోయ్

ప్రకృతి విధ్వంసమైతే ప్రాణ మాగే నోయ్॥శిలా॥

8.కలలు కనకుండా సంద్రం అలలు మీటేనా ?

కడలి రాకుండా మేఘం నదిగ మారేనా ?

చినుకు చినుకు వొడిసి పడితెనె సిరులు పండేటి

శ్రమకు జీవం పోసినపుడే కడుపు నిండేటి॥శిలా॥

9.కాలమన్నది తిరిగి రానిది కాల చక్రము ఆగిపోనిది

కాలముకు వెలకట్ట గలమా ? కాలమును భయపెట్ట గలమా ?

కాలమన్నది దాచి పెడితే, దాగి ఉంటుందా ?

కాలగమనం తెలియకుండ ఫలిత ముంటుందా॥శిలా॥

10. కొట్టినా నీ మేలు మరువని గట్టి గుణమీచెట్టులో

ఆకుతెంచితె పాలుకారే అమ్మతనమీ కొమ్మలో

సృష్టిలో ప్రతి జీవ జాతికి సృజన ఉన్నది నేర్చుకో

ప్రకృతిని కాపాడి నేలకు పర్యావరణం ఇచ్చిపో..॥శిలా॥

11.కడుపులో పదినెలలు మోసి కంటికి రెప్పో లె కాసి

బరువు బాధ్యత లెన్నో చూసి బతుకునంతా ధార పోసి

తల్లిదండ్రికి మించినా దైవముంటుందా ?

అమ్మనాన్నల కంటె మించిన ఆస్తులుంటాయా?॥శిలా॥

12.ప్రేమకు కొలమానముందా ? పెళ్ళికి ఒక రూపముందా ?

భార్య భర్తల బంధమన్నది బతుకునా విడదీయలేనిది

ఒకరి బాధ్యత ఒకరు మోసే బలము ఉన్నది ప్రేమలో

ఒకరి కోసం ఒకరు బతికే త్యాగమున్నది చెలిమిలో ॥శిలా॥

13.తల్లిదండ్రులు భార్య పిల్లలు అన్నదమ్ములు అక్కచెల్లెలు

కొడుకులు కోడళ్ళు వాళ్ళ మనువలు ముని మనువరాళ్ళు

పాత తరమే కొత్త తరముగ ప్రతి ఫలిస్తోందో...

జన్మకు ప్రతి జన్మగా సాగిపోతుందో..॥శిలా॥

14.మట్టిలో మమకారమున్నది చెట్టులో మన ప్రాణమున్నది

పుట్టుకకు ఒక లెక్క ఉన్నది పట్టు దలకో లక్ష్యమున్నది

సాధనే నీ ఊపిరై సాగిపోవాలి...ధైర్యమే నీ బలముగా గెలిచి తీరాలి॥శిలా॥

15.గాయపడకుండా హృదయం గేయమౌతుందా ?

కలత పడకుండా మెదడు కావ్యమౌతుందా

ఉలికి బయపడితే శిలలు శిల్పమౌతాయా ?

అలకు భయపడితే నావ దరికి చేరేనా

ఆటుపోటులు ఎదురు దెబ్బలులేని జీవిత మున్నదా ?

ఓర్పు ను చవి చూడకుండా మార్పు కు తావున్నదా ?॥శిలా॥

16.వెన్ను నిమిరితే ఎగిరి పడకు వెన్నుపోటుకు బెదిరి పోకు

నమ్మి నువ్వు మోసపోకు నమ్మినోళ్ళను వదులుకోకు

ఏది ధర్మమో ఏదధర్మము ఏది సత్యము ఏదసత్యము

ఏది స్వార్ధమె ఏది వ్యర్థము తెలిసి నడవాలోయ్ ...॥శిలా॥

17.కత్తితో సాధించ లేనిది కరుణతో సాధించ వచ్చు

పోరులో నువ్వు గెలవ లేనిది ప్రేమతోను గెలవవచ్చు

మంచి పనులే మనిషికి గీటురాయి...

మనిషి పోయినంక మిగిలే గుర్తులోయి...॥శిలా॥

18.దేవుడిని చేసింది నీవు దైవముగ కొలిసింది నీవు

మతములను సృష్టించి జనుల మతులను మార్చింది నీవు

మానవత్వమే మనిషికి మతము కావాలో..

మనుషులంతా ఒక్కటేనని హితము పలకాలో...॥శిలా॥

19.మత్తులో పడి మాసి పోకు మరణమును కొనితెచ్చు కోకు

వస్తువుకు నువ్వు భానిసవకు స్వార్ధముతో దిగజారి పోకు

బానిసత్వం వదలకుండ బాగుపడలేమో...

బతుకు అర్థం తెలియకుండ మసలు కోరాదో...॥శిలా॥

౨౦.కులములన్నియు కూలిపోవును మతములన్నియు మాసి పోవును

జ్ఞానమొక్కటె మిగిలిపోవును త్యాగమొక్కటె నిలిచి పోవును

విజ్ఞానమే విశ్వాంతరాలను దాటివస్తుందో

త్యాగమే నీ చరితను తిరిగి రాస్తుందో..॥శిలా॥

౨౦.విజ్ఞాన మొక్కటె చాలదు వివేకమును అలవరుచుకో...

ధనము ఒక్కటె చాలను నీ గుణమును సరిచేసుకో..

కలిమి లేములు కష్ట సుఖములు కాలగమనం తెలుసుకో

మనిషి రుషిగా మారెటందుకు మార్గమన్నది ఎంచుకో॥శిలా॥

21.కన్నుమిన్ను ఎరుగకుండా కండకావర మొచ్చినా.

అదుపుతప్పి మదుపుతప్పి ఆస్తి పాస్తులు పెరిగినా.

అంగబలము అర్ధబలము అధికార బలముతో ఊగినా

మానవత్వం విడిచినంక మనిషి విలువేముండునా ...॥శిలా॥

22.ఇల్లు శుభ్రత వళ్ళు శుభ్రత మనసు శుభ్రత మాట శుభ్రత

నడిచినా నీ నడత శుభ్రత బతికినానీ బతుకు శుభ్రత

శుభ్రతే సువిశాల హృదయం కలిగి ఉంటుందో ...

శుభ్రతే ఈ మలినమంతా శుద్ధి చేస్తుందో ...॥శిలా॥

23.ఆడపిల్లను పుట్టనివ్వు ఆడపిల్లను పెరగనివ్వు

ఆడపిల్లను చదవనివ్వు ఆడపిల్లను ఎదగనివ్వు

ఆడపిల్లలె పుడమికి ఆనవాళ్ళు.

ఆడజన్మే లేకపోతే అమ్మలేదు ...॥శిలా॥

24.స్నేహమే మన జిందగీ స్నేహమే మన బందగీ

స్నేహమే మన సన్నిధి స్నేహమే మన పెన్నిధి

స్నేహమేలే జీవితానికి వెలుగునిచ్చే వెన్నెల

స్నేహమే మన దారి పొడుగున నీడనిచ్చే తోడులా ...॥శిలా॥

25.పాడి పంటలు కల్ల దేశం పస్తులతో అల్లాడు తరుణం

పేదలే నిరు పేదలై ధనవంతులే ధనవంతులై

ఆకలితో జన మొక్కటైతే ఆగమేనోయి...

అంతరాలు లేని లోకమె శాంతి వనమోయి...

శిలా నీవే శిల్పి నీవే శిల్పము నీవే సృష్టిలో.......